క్లుప్తంగా

బాధితుడికి ప్రభుత్వం అండ


ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: గత కొన్ని నెలలుగా రక్త కణాలు అభివృద్ధి లేక బాధపడుతున్న ఓ బాలుడికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. చందన గ్రామానికి చెందిన నాగరాజు లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. అతడి కుమారుడు రాజేష్ పదో తరగతి చదువుతున్నాడు. బాలుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమస్యను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, స్థానిక నేత శివకేశవరెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన స్పందించి వెంటనే ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స ప్రారంభించేలా ప్రభుత్వం నుంచి రూ.15 లక్షలు(ఎల్‌ఓసీ) మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ఎల్‌ఓసీని నాగరాజుకు అందజేశారు.

ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా మున్సిపాల్టీ నుంచి ట్రేడ్ లైసెన్సులను పొందాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శనివారం పట్టణంలోని ధర్మవరం గేట్ రోడ్, భాగ్యనగర్, ఇందిరానగర్‌లో శానిటేషన్‌ను పరిశీలించిన కమిషనర్ ట్రేడ్ లైసెన్సులను పరిశీలించారు. ట్రేడ్ లైసెన్సులు లేని వారు వెంటనే తీసుకోవాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంటింటా చెత్తసేకరణపై ప్రజలతో ఆరాతీశారు. కంపోస్టు యార్డును పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ తీర్మానం హర్షణీయం

గుత్తి: దళిత క్రిష్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానించేయడం హర్షణీయమని గుత్తి పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలోని ఓ షాపులో శనివారం మాజీ వార్డు సభ్యులు వైపీ బాబు, పాస్టర్లు వాసు అనిల్ కాంత్, నరేష్, అబ్రహాం, సాలోమన్, జాకబ్, ఆరోన్ విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ దళిత క్రిష్టియన్ల పరిస్థితులను తెలుసుకుని ఎస్సీ జాబితాలో చేర్చడానికి తీర్మానం చేయడం సంతోషకరమన్నారు. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.


జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థులు

గుంతకల్లు: వచ్చే నెల 5 నుంచి చండీఘడ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో జరిగే ఆలిండియా సాఫ్ట్‌బాల్ పోటీలకు పట్టణంలోని శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. కళాశాలకు చెందిన ప్రసన్నకుమార్, నల్లన్న, సురేష్ బాబు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించి సత్కరించారు. అధ్యాపకులు బసెట్టి కృష్ణయ్య, డాక్టర్ పూజారిగోపి, పి.శ్రీనివాసులు, పీడీ బాషా తదితరులు పాల్గొన్నారు.

యువతి హత్య కేసులో నిందితుడికి రిమాండ్

బుక్కరాయసముద్రం: యువతి హత్యకేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం బీకేఎస్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నార్పల మండలం నడిమిదొడ్డికి చెందిన జాఫర్ ప్రేమ పేరుతో నమ్మించాడు. జాఫర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో నార్పలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బొందలవాడకు చెందిన రమాదేవితో పరిచయం పెంచుకుని, ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని రమాదేవి కోరడంతో తిరస్కరిస్తూ వచ్చాడు. ఈ నెల 4న బీకేఎస్ చెరువు వద్ద జాఫర్‌ను రమాదేవి నిలదీసింది. ఆ సమయంలో గొడవ చోటు చేసుకోవడంతో ఆమెను హతమార్చి, దుస్తులు తొలగించి చెరువులో పడేశాడు. అనంతరం ఆమె దుస్తులను అక్కడే రాతి కింద దాచి పెట్టి, హతురాలి సెల్‌ఫోన్ తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయాడు. యువతి సెల్‌ఫోన్ ఆధారంగా జాఫర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పెంపుడు కుక్క దాడి


బాధితుడు నాగరాజు

గుంతకల్లు: స్థానిక బెంచ్ కొట్టాల వాసి రైల్వే గార్డు నాగరాజుపై పెంపుడు కుక్క (రాట్ వీలర్) దాడి చేసి విచక్షణా రహితంగా కొరికింది. చేతిపై పలు గాయాలయ్యాయి. వివరాలు... నాలుగేళ్లుగా రాట్ వీలర్ జాతికి చెందిన ఓ కుక్కను నాగరాజు ఎంతో ముద్దుగా పెంచుకుంటున్నారు. శనివారం రాత్రి డ్యూటీ నుంచి వచ్చిన నాగరాజు అలవాటుగా కుక్క వద్దకెళ్లి పలకరించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఉన్నఫళంగా నాగరాజుపై అది దాడి చేసింది. కుడిచేతిని అడ్డు పెట్టగా ఎక్కడికక్కడ కండలు పట్టి పీకింది. వెంటనే కుటుంబసభ్యులు అప్రమత్తమై కుక్కను అదుపు చేసి, తీవ్రంగా గాయపడిన నాగరాజును ఆస్పత్రికి తరలించారు.

ముస్లింల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


ఇమామ్‌లు, మౌజన్లకు ఇంటి పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఫయాజ్‌బాషా తదితరులు

తాడిపత్రి టౌన్ : ముస్లింల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో శనివారం వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి అధ్యక్షతన 40 మంది ఇమామ్‌లు, మౌజన్లకు ఇంటి స్థలాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతోపాటు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ ఫయాజ్‌బాషా, తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు అన్ని విధాలుగా సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న పాలనలో తాడిపత్రి ప్రాంతం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గత పాలకులు ముస్లింలను రాజకీయాలకు మాత్రమే వినియోగించుకున్నారే తప్ప వారి అభివృద్ధికి పాటుపడలేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లినప్పుడు ఇమామ్‌లు, మౌజన్‌లు సొంత ఇళ్లులేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని గుర్తించి తహసీల్దార్‌తో మాట్లాడి ఇంటి స్థలాలు మంజూరు చేయించామన్నారు. ఇంకా అర్హులైన వారుంటే దరఖాస్తుకుంటే ఇంటిస్థలాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా ముస్లింల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ముస్లింలకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఫయాజ్‌బాషా మాట్లాడుతూ గత పాలకులు ముస్లింల సమస్యలను విస్మరించారన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ఇంటిస్థలాలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు.రూరల్ పరిధిలోని హాజీవలి దర్గాను కమిటీ సభ్యుల సహకారంతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, కార్యదర్శి బాబా, కోశాధికారి బాబయ్య, షాదీఖానా అధ్యక్షుడు అన్వర్, సెక్రటరీ జబ్బార్, కోశాధికారి షఫీ, మైనార్టీ నాయకులు జాకీర్, బషీర్, రియాజ్, వల్లిబాషా, ఆలీ, ఘోరా తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభం

స్థానిక కృష్ణాపురం జీరోడ్డులోని గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉగాదిని పురస్కరించుకుని ఆకుల రామాంజులరెడ్డి, ఆకుల కొండారెడ్డి గార్ల జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన రాతి దూలం పోటీలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నేత ఆకుల పెద్దనాగిరెడ్డి, ఆయన సోదరుడు, కౌన్సిలర్ ఆకుల చిన్ననాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాతి దూలం పోటీలకు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. పీఆర్‌పల్లికి చెందిన నాగరాజు వృషభాలు ప్రథమ, శ్రీరాములు యాదవ్ వృషభాలు ద్వితీయ, కె. రామాంజనేయులు(గార్లదిన్నె) వృషభాలు తృతీయ, మేకల సుదర్శన్(శ్రీరంగాపురం) వృషభాలు నాలుగో, కుర్రపాటి భాస్కర్‌నాయుడు తేరన్నపల్లి ఐదో, గజ్జల చెన్నప్ప(కుందన కోట) ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలతోపాటు మిగతా వృషభాల యజమానులకు రూ.5 వేల చొప్పున నగదు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రమాదేవి కుటుంబాన్ని ఆదుకుంటాం


సాయం అందిస్తున్న పీడీ నరసింహారెడ్డి

నార్పల: హత్యకు గురైన బొందలవాడ వాసి రమాదేవి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం ఆయన గ్రామానికి చేరుకుని రమాదేవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా మహిళా సంఘాలు అందించిన రూ.5 వేలను వారికి అందజేశారు. ఏపీడీ ఈశ్వరయ్య, ఏపీఎం తిప్పమ్మ పాల్గొన్నారు.

ముగిసిన తిరునాల

పుట్లూరు: నాయకునిపల్లి సమీపంలో బాట సుంకులమ్మ తిరునాల శనివారం ముగిసింది. చివరి రోజు భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్య పరిరక్షణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్

గుంతకల్లు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమని మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో ఏఓ స్వాతి, హెచ్‌ఓ మిత్రవింద మాధవి, సీఎస్‌డీటీ సుబ్బులక్ష్మి, సీడీపీఓ నాగమణి హాజరై ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. రసాయన మందుల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోవడం వల్ల భూములు నిస్సారం కావడమే కాకుండా పంటలు విషతుల్యం అవుతున్నాయన్నారు. కానీ ప్రకృతి వ్యవసాయం ద్వారానే అతి తక్కువ ఖర్చుతో పంటలు పండించవచ్చన్నారు. పంటలు సైతం ఆరోగ్యకరంగా ఉంటాయని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం పండించే రైతులకు సీడబ్ల్యూఎస్ సంస్థ ఉచితంగా సేంద్రియ ఎరువులను సరఫరా చేయడమే కాకుండా, పెరటితోటలను ప్రోత్సహిస్తూ అవసరమైన 14 రకాల విత్తనాలను ఉచితంగా అందజేస్తుందని సంస్థ కమ్యూనిటీ మొబలైజర్ అనిత ప్రసన్న, భరత్ తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వెంకటాంపల్లి, గుర్రబ్బాడు, కదిరిపల్లి, అయ్యవారుపల్లి, ఇమాంపురం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండే ఎండలను దృష్టిలో ఉంచుకుని చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ నాగమణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం కసాపురంలో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పిల్లలు ఎండకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారు ఎక్కువగా నూలు వస్త్రాలు ధరించేలా చూసుకోవాలన్నారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతోపాటు వివరాలను తల్లులకు తెలియజేయాలన్నారు. అనీమియాతో బాధ పడుతున్న గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


టెన్త్ విద్యార్థినులకు పెన్నులు అందిస్తున్న బాణా నాగేశ్వరరెడ్డి, సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం పట్టణంలో వివిధ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఏప్రిల్‌లో పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా విద్యార్థులు చింతల వేంకటరమణస్వామి, అమ్మవారిని దర్శించుకుని హెల్‌టికెట్లు పాదాల ఉంచి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఆలయ కమిటీ సభ్యులు పరీక్ష సామగ్రి అందించారు. ఆలయ కమిటీ సభ్యులు సంజన్న, లక్ష్మీదేవి, భగీరథమ్మ, ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ స్వామి పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు శనివారం వైఎస్సార్‌సీపీ నేతలు గట్టు గోవర్ధన్ రెడ్డి, గట్టు నిరంజన్ రెడ్డి పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. రెండేళ్లుగా విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్నట్లు వారు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నరేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి


తిమ్మంపల్లిలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు మలేరియా అధికారి సత్యనారాయణ

యల్లనూరు: చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా అదనపు మలేరియా అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం యల్లనూరు పీహెచ్‌సీ పరిధిలో నిట్టూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, పెద్దమల్లేపల్లి సచివాలయం, తిరుమలాపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, 104 సర్వీసులను పరిశీలించారు. తిమ్మంపల్లి పీహెచ్‌సీ పరిధిలో తిమ్మంపల్లి, బుక్కాపురం, కల్లూరు గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. కార్యక్రమంలో తాడిపత్రి సబ్ యూనిట్ మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి లోకేష్, వైద్యులు శివసాయి, ఎంపీహెచ్‌ఈవోలు వీరనారాయణ, మధుకుమార్, పీహెచ్‌ఎన్ జగదాంబిక, హెల్త్ అసిస్టెంటు శరత్, నాగేశ్వరరెడ్డి , ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట


పామిడి: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం వైకేపీ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా సొమ్ము విడుదల కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించారు. మండలంలో మూడో విడతగా 1044 సంఘాలకు రూ.9. 28 కోట్లు విడుదల చేసినట్లు వారు తెలిపారు. ఏపీఎం మద్దిలేటి, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నార్పల: అక్కచెల్లెమ్మలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం తీసుకువచ్చిందని సర్పంచు మన్నీల సుప్రియ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్బీకే–4లో వైకేపీ అధికారులు నిర్వహించిన మహిళా సంఘాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీఎం తిప్పమ్మ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 1,059 సంఘాలకు రూ.9,51 కోట్లు విడుదలైందన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు రేఖ పాల్గొన్నారు.

పుట్లూరు: వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద 6,149 మంది స్వయం సంఘాల మహిళలకు రూ.4,50,85613 లబ్ధి చేకూరినట్లు ఏపీఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం మండలవ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయడాన్ని మహిళా సంఘాల సభ్యులు టీవీల ద్వారా తిలకించారు.

పామిడి: స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణలో శనివారం ప్రగతి పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సంఘాల సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు మెప్మా టీఎంసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ పామిడి నగర పంచాయతీకి సంబంధించి 364 మహిళా సంఘాలకు మూడు దఫాలుగా మొత్తం రూ.9.73 కోట్లు మాఫీ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


చెక్కు అందిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఏడవ వార్డులో ఇటీవల పద్మావతి, వన్నూరప్ప అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఏడవ వార్డు కౌన్సిలర్ వరదరాజులు, వైఎస్సార్ సీపీ నాయకులు కెఎం రంగనాయకులు, లాల్ రెడ్డి, భాస్కర్, స్టోర్ మస్తాన్, అరుణ్, లింగారెడ్డి, దేవేంద్ర, సచివాలయ ఉద్యోగులు సుమలత, గంగాధర్, అలీ అక్బర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడిగా శ్రీరాముడు


శ్రీనివాసస్వామి అలంకారంలో శ్రీరాముడు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్ ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రాత్రి శ్రీనివాసస్వామి అలంకారంలో శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుత్ దీపాలతో రంగు రంగుల పూలతో అలంకరించిన స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు జయవరం అశ్వత్థరంగయ్య, అధ్యక్షుడు భూమా హరినారాయణ, ఉపాధ్యక్షుడు రామలింగప్రసాద్, కార్యదర్శి భూమా విజయ్‌కుమార్, ఉప కార్యదర్శి కుప్పం సత్యనారాయణ, కోశాధికారి సత్యనారాయణప్రసాద్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం

బుక్కరాయసముద్రం: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పిస్తోందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చందన పేర్కొన్నారు. శనివారం రెడ్డిపల్లి కేవీకేలో (రావేస్) ద్వారా ఎస్‌బీవీఆర్ అగ్రికల్చర్ విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ చందన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయ రంగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు పంటల సాగు వాటిలో తెగుళ్ల నివారణ మార్గాలు, నీటి యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ సౌకర్యం వంటి అంశాలపై ట్రీ డయాగ్రామ్ ద్వారా అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

బుక్కరాయసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీపీ సునీత సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం–3లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ, సూపర్ వైజర్ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత కొండమ్మ పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ


రక్తదానం చేస్తున్న అధ్యాపకుడు

బుక్కరాయసముద్రం: రక్తదానం ద్వారా మరొకరికి పునర్జన్మను ప్రసాదించవచ్చని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆలూరి సాంబశివారెడ్డి తల్లి ఆలూరి నారాయణమ్మ 16వ వర్ధంతి సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్, అనంతపురం జీజీహెచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు రమణారెడ్డి మాట్లాడుతూ రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, టీపీఓ రంజిత్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ చిన్న పుల్లయ్య, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రోటరీపురంలో ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ చిన్న పుల్లయ్య, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి భవనాల ప్రారంభం


ఆలయ కాంప్లెక్స్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలకు సూచించారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద 3, పెద్దమ్మ గుడి వద్ద 2 కాంప్లెక్స్‌లను నిర్మించారు. వీటిని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెన్నకేశవస్వామి ఆలయ భూమి అన్యాక్రాంతమయ్యాయన్నారు. గతంలో భూమి ద్వారా వచ్చే ఆదాయంతో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించే వారని, ప్రస్తుతం ప్రజల విరాళాల ద్వారా బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి వస్తోందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అంతకు మునుపు ఎమ్మెల్యేకువైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో యాడికి, తూట్రాళ్లపల్లె సర్పంచులు పందు అనురాధ, సంజీవరాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఆలయ ధర్మకర్త రామిరెడ్డి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు రామచంద్ర, తిరుపతిచౌదరి, నాయకులు దాసరి శ్రీధర్, రామేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలు విశ్వసించరాదు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సౌమిత్రో బెనర్జీ

గార్లదిన్నె: విద్యార్థులు మూఢనమ్మకాలను విశ్వసించరాదని, సైన్స్‌పై ఆధారపడి మాత్రమే విషయాలను విశ్లేషించుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సౌమిత్రో బెనర్జీ పేర్కొన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్లో శాస్త్రీయ దృక్పథం అను అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా సౌమిత్రో బెనర్జీ మాట్లాడుతూ శాస్త్రవేత్తలందరూ శాస్త్రీయ పద్ధతులను అనుసరించే అనేక విషయాలను ఆవిష్కరించారన్నారు. శాస్త్రీయ పద్ధతి అనునది ప్రయోగము, నిర్ధారణలపై ఆధారపడి ఉండదన్నారు. అరిస్టాటిల్ కాలం నాటి భావాల్లో కేవలం నమ్మకం ఉండేదని, ప్రయోగము చేయాలనే భావన రాలేదన్నారు. గెలీలియో శాస్త్ర ప్రయోగాలు అవసరమని, పీసా టవర్ ప్రయోగం ద్వారా చేసి చూపించారన్నారు. విద్యార్థులందరూ ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి దృగ్విషయాన్ని ఎప్పుడు? ఎందుకు? ఎలా? అనే ప్రశ్నలతో ఆలోచించాలన్నారు. అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు, బ్లాక్ మ్యాజిక్ వంటి వాటిని విశ్వసించరాదన్నారు. అనంతరం ఉపాధ్యాయులు శాస్త్రవేత్త సౌమిత్రో బెనర్జీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రకళ, సైన్స్ ఉపాధ్యాయులు అబ్దుల్, అలీమ్, హీరలాల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుంతకల్లు రూరల్: అయ్యవారుపల్లి నుంచి పామిడికి వెళ్లే రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..అయ్యవారుపల్లి గ్రామానికి చెందిన హరిజన సంజన్న సాయంత్రం పనినిమిత్తం బైక్‌పై పామిడికి బయలుదేరాడు. గ్రామం దాటగానే ఆటోను ఓవర్‌టేక్ చేస్తూ ముందుకు వెళ్లాడు. అదే సమయంలో ఎదురుగా వేగంగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో సంజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

పామిడి: కండ్లపల్లి గ్రామంలో శనివారం ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు మూడో విడత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 60 ఏళ్ల పైబడిన 53 మంది వృద్ధులకు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ శ్రావణి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 10 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఎంపీహెచ్‌ఈఓ శ్రీధర్, ఎంపీహెచ్‌ఎస్ సుధాకర్, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్‌నాయక్ అనే విద్యార్థి జాతీయస్థాయి మీన్స్ కంమెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. నక్కనదొడ్డి తండా గ్రామానికి చెందిన మల్లేష్ నాయక్, లక్ష్మీబాయిల కుమారుడైన చరణ్ నాయక్ పాతకొత్తచెరువు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల హెచ్‌ఎం గ్రేస్ మేరీ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

గుత్తి: పట్టణంలోని కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పూజిత, అలియా కౌసర్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబహాన్, సీనియర్ ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు శనివారం చెప్పారు. వీరికి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్ షిప్ అందుతుందన్నారు.

యాడికి: మండలంలోని మోడల్ స్కూల్, యాడికి, రాయలచెరువు ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విజయమ్మ, మారుతి, డేనియల్ తెలిపారు. యాడికి ఉన్నత పాఠశాల నుంచి విక్రమ్‌రెడ్డి, బి తరిని, దేదీప్య, మోడల్ స్కూల్ నుంచి యాస్మిన్, వెంకటాద్రి నాయుడు, రాయలచెరువు పాఠశాల నుంచి నికిత ఎంపికయ్యారన్నారు.

CHANGE OF NAME

I, **Voorvakila Hanumantha Reddy,** S/o Voorvakila Chinna Nagi Reddy. Need correction of my name in my passport no: M4705045. From **Vuruvakili Hanumantha Reddy** (Old Name) to **Voorvakila Hanumantha Reddy** (New Name) R/o D.No: 3-20, Mukundapuram (V), VTC Yerraguntla (Pb), Garladinne (M), Ananthapuram dist. A.P. As per my Adhar card no: 2147 8179 1648. Henceforth my name known as **Voorvakila Hanumantha Reddy.**

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU

O.S. No. 768/2021

Between :
P. Ramakrishna ... Plaintiff
and
K. Virupan ... Defendant

Notice to Defendant

TO : K. Virupan S/o. K. Nabi Rasool, Business and agriculturist, Kallur R.S. Village, Garladinne Mandal, Anantapur Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము **31-03-2023వ తేదీ ఉదయం 10-30 గం॥లకు** వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

H. RAMASUBRAMANYAM, Advocate
Anantapuramu. Cell : 9885734278